క్లుప్తంగా

ఆర్థికసాయం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సీఈసీ మొదటి సంవత్సరం చదివిన మోతె గ్రామానికి చెందిన భోగ శ్రీజకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ. 25 వేల చెక్కును బుధవారం అందజేశారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో భోగ వసంతవీరేశం కూతురు శ్రీజ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి, తడగొండ హన్మంతు, బండారి భువన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రామడుగు: వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామడుగు ఎస్సై రాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎండాకాలం ఆరుబయట నిద్రించేవారు ఇంట్లో ఎవరు చొరబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రధానంగా మహిళలు మెడలో బంగారు ఆభరణాలు ధరించి పడుకోవడం సరికాదన్నారు. ఉదయం ఇంటి ముందు పనులు చేసే మహిళలు జాగ్రత్తగా ఉండాలని చైన్ స్నాచర్స్‌తో ప్రమాదం ఉందని, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 ఫిర్యాదు చేయాలని సూచించారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

మానకొండూర్‌రూరల్: మండలంలోని ముంజంపల్లి శివారులోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో భూభారతిపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. సదస్సుకు కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో మహేశ్వర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు. మండలంలోని గ్రామాల రైతులు, ప్రజలు, విద్యావంతులు హాజరై సదస్సును విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థులకు సన్మానం


సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

గన్నేరువరం: మండలంలోని కాసింపేట గ్రామానికి చెందిన బొజ్జ శ్రీజ, వైష్ణవి కరీంనగర్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎంపీసీలో అత్యధిక మార్కులు సాధించినందుకు యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. శ్రీజ 968/1000, వైష్ణవి 450/470 మార్కులు సాధించారని, భవిష్యత్‌లో మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యాదవ్ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలి

సైదాపూర్: మండలంలోని వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కూతాటి రాణాప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం సైదాపూర్ వైద్య, ఆరోగ్యశాఖ సబ్ సెంటర్‌లో చిన్నారులకు వ్యాక్సిన్లు ఇవ్వకుండా ఎండలో నిలబెట్టి, సెల్‌ఫోన్ చూసుకుంటూ ఉన్నారని, ఇదేంటని ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తించారని డిప్యూటీ డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి వైద్యాధికారి విధులు నిర్వహించడంలేదని పేర్కొన్నారు.

కొలతలు లేకుండా వేతనమివ్వాలి

శంకరపట్నం: ఉపాధిహామీకూలీలకు కొలతలు లేకుండా వేతనాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వర్ల రాజు డిమాండ్ చేశారు. మండలంలోని మొలంగూర్, ఆముదాలపల్లి, రాజాపూర్, మెట్‌పల్లి గ్రామాల్లో బుధవారం కూలీల సమస్యలను తెలుసుకున్నారు.

బెల్లం, పటిక పట్టివేత



జమ్మికుంట: గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం, పటికను జమ్మికుంట బ్లూకోల్ట్స్ పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న నిషేధిత 60 కిలోల బెల్లం, 30 కిలోల పటికను పట్టణంలోని బస్టాండ్ వద్ద బ్లూకోల్ట్స్ పోలీసులు శ్రావణ్, చిట్టిబాబు, శ్రీను, అనంద్ పట్టుకున్నారు. హుజూరాబాద్‌లో కొనుగోలు చేసి జమ్మికుంట బస్టాండ్ వద్ద ఆటోలో నుంచి ఐదుగురు వ్యక్తులు దిగారు. సంచులను పరిశీలించి ఇద్దరు మహిళలను పట్టుకోగా మరో ముగ్గురు పారిపోయారని, మహిళలు పరకాల మండలంలోని తండాకు చెందిన వారని, పట్టుకున్న బెల్లం, పటికను ఎక్సైజ్ పోలీసు అధికారులకు అప్పగించామన్నారు.

అసంపూర్తి పనులు.. ప్రమాదాలు


అన్నారం శివారులో అధ్వానంగా లో లెవల్ కాజ్‌వే

మానకొండూర్: మానకొండూర్–జమ్మికుంట వరకు తారురోడ్డు నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా లో లెవల్ కాజ్‌వేల వద్ద బ్రిడ్జీల నిర్మాణంతోపాటు ఇతర పనులు మాత్రం పూర్తికాలేదు. దీంతో లో లెవల్ కాజ్‌వేల వద్ద ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా మానకొండూర్ నుంచి పచ్చునూర్ వరకూ సుమారు 17 కిలోమీటర్లు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కాంట్రాక్టర్ పూర్తి చేశాడు. పనులు కూడా పూర్తయి మూడేళ్లు అవుతుంది. కానీ అన్నారం శివారులో రెండు లో లెవల్ కాజ్‌వేలు, పోచంపల్లిమోడల్ సమీపంలోని డీబీఎం 6 ఉప కాలువ వద్ద బ్రిడ్జి నిర్మాణం, తారురోడ్డు వేయాల్సి ఉండగా పనులు మాత్రం నిలిచిపోయాయి. తారురోడ్డు లేకపోవడం, ఉన్న రోడ్డు గుంతలమయంగా, అద్వానంగా మారింది. ఇటీవల అన్నారం శివారులోని కాజ్‌వే వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. అలాగే డీబీఎం 6 ఉప కాలువ వద్ద కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తి పనులు పూర్తిచేసి ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి


చొప్పదండి: కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న ఏవైఎస్ సభ్యులు


శంకరపట్నం: కేశవపట్నంలో ...

చొప్పదండి: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం సమీపంలో ఉగ్రవాదులు పర్యాటకులను కాల్చిచంపడాన్ని నిరసిస్తు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏవైఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగరాజు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, అంజయ్య, రత్నం, దినకర్, రాజేశం, మహేశ్, కదారి శంకర్, కల్లెపల్లి అరవింద్, పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

రామడుగు: రామడుగు, గంగాధర చౌరస్తాలో బుధవారం సాయంత్రం బీజేపీ నాయకులు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. గంగాధర చౌరస్తాలో కొవ్వొత్తులతో మృతులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల ప్రభాకర్ యాదవ్, ఒంటెల కరుణాకర్‌రెడ్డి, బండ తిరుపతిరెడ్డి, పోచంపల్లి నరేష్, కట్ట రవీందర్, పంజాల ప్రశాంత్ పాల్గొన్నారు. హిందువులపై దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు.

శంకరపట్నం: ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మకుశాంతి కలగాలని కేశవపట్నంలో బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అనిల్, మాజీ సర్పంచ్ రాములు, రాసమల్ల శ్రీనివాస్, నరేందర్ తదితరులు ఉన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తున్నాం

జమ్మికుంట: ఉగ్ర దాడిని జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వద్లూరి బుధవారం ఖండించారు. ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని మృతుల కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. పర్యాటకులపై ఉగ్రదాడిని యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రాచపల్లి సాగర్ ఖండించారు. దేశ భద్రతపై నిఘా వ్యవస్థ వైఫల్యం చెందిందని బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని, భద్రత బలోపేతం చేయాలన్నారు.


రామడుగులో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు


గంగాధర చౌరస్తాలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

విద్యార్థుల ప్రవర్తన గమనిస్తుండాలి

హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి


మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జి

జమ్మికుంట: విద్యార్థుల ప్రవర్తన, పద్ధతులను గమనిస్తూ డ్రగ్స్, గంజాయి వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి అన్నారు. బుధవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో టౌన్ సీఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులతో డ్రగ్స్, మాదకద్రవ్యాలపై నివారణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల స్థాయిలో డ్రగ్స్ నివారణ కమిటీ, వాట్సాప్ గ్రుపు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు విచ్చల విడిగా ప్రవర్తించకుండా, ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు,సైబర్ నేరాలపై నెలకోసారి సమావేశం నిర్వహించుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్‌కు బానిసైన విద్యార్థులకు ప్రత్యేక వైద్య సదుపాయం, మంచి ప్రవర్తనకు పోలీస్‌శాఖ కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు డ్రగ్స్ నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ డా.రమేష్ అధ్యక్షతన యాంటి డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణ, వ్యసనపరులకు పునరావాసం అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

హుజూరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తోందని ఎంఈవో భూపతి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రతాపవాడ ప్రాథమిక పాఠశాలలో పీటీఏ ప్రోగ్రాంకు హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ప్రాథమిక దశలో పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రంగు దామోదరాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

పెన్షనర్స్ ధర్నా విజయవంతం చేయాలి

హుజూరాబాద్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి 29న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, గౌరవ అధ్యక్షుడు కట్టా నాగభూషణాచారి బుధవారం ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 2024 నుంచి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్స్‌కు బెనిఫిట్స్, పెండింగ్ ఐదు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. పెన్షనర్స్‌కు సంబంధించిన న్యాయపరమైన హామీలను ప్రభుత్వం పరిష్కారించాలని కోరుతూ ధర్నాను నిర్వహిస్తున్నామని తెలిపారు.

విద్యార్థులకు మోదుగు ఆకులో భోజనం



శంకరపట్నం: మండలంలోని వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం మోదుగు ఆకుల్లో భోజనం వడ్డించారు. విద్యా సంవత్సరం చివరి రోజు సందర్భంగా పూర్వ విద్యార్థి అపర్ణ విద్యార్థుల కోసం భోజనం తయారు చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం మోదుగు ఆకులతో విస్తర్లు తయారు చేయించి అందులో విద్యార్థులకు భోజనం వడ్డించామని హెచ్ఎం కోటేశ్వర్‌రావు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో అదనపు తూకం


ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

శంకరపట్నం: మండలంలోని కరీంపేటలో తాడికల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుధవారం 42 కేజీలు తూకం వేశారు. ఇటీవల కొనుగోలు కేంద్రాలను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించి బస్తాకు 40 కేజీల ఆరువందల గ్రాముల ధాన్యం తూకం వేయాలని ఎక్కువ తూకం వేస్తే సెంటర్ ఇన్‌చార్జిపై కేసు నమోదు చేస్తామన్నారు. సంఘం పరిధిలో అన్ని కొనుగోలు కేంద్రాల్లో 42 కేజీలు తూకం వేస్తున్నారని, సీఈవో వీరస్వామి వేయమంటే వేస్తున్నామని కరీంపేట ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి వనపర్తి సాయి తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గెటి సదానందం బుధవారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చెన్నవేన రమేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు మంగ అశోక్, సీనియర్ నాయకులు ఎగ్గెటి కుమారస్వామి, తోర్నే సంతోష్, మర్రి శ్రీనివాస్, రామిడి సూర్యతేజారెడ్డి, నాయకులు పర్శ రాములు, సీఏలు బోనగాని ప్రియంక, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మానకొండూర్‌రూరల్: మండలంలోని ఎస్సీకాలనీ, పోస్టాఫీస్ మార్గంలోని డ్రైనేజీలో చెత్త పేరుకుపోయింది. రెండు నెలల నుంచి మురుగుకాలువను శుభ్రం చేయక పోవడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రేవంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, మానకొండూర్, సెల్ నంబర్ : 98851 61773

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

శ్మశాన వాటిక దారి కబ్జాపై విచారణ


విచారణ చేస్తున్న తహసీల్దార్ రమేశ్, సిబ్బంది

జమ్మికుంట: పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్ పక్కన నుంచి శ్మశాన వాటికకు వెళ్లే దారి కబ్జా చేసి గోడ నిర్మించారనే ఆరోపణలపై తహసీల్దార్ రమేష్ బుధవారం విచారణ చేపట్టారు. గతంలో శ్మశానవాటికకు అధికారికంగా దారి, బోర్డు ఏర్పాటు చేయగా గార్డెన్ యజమాని బోర్డు తొలగించి, రోడ్డు కబ్జా చేశాడని, ఆర్డీవో, తహసీల్దార్‌కు సామాజిక కార్యకర్త సిలువేరు శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. రోడ్డు కబ్జాకు గురైందని, ఆక్రమణపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్, సర్వేయర్ మనోజ్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయకుంటే సమస్య పరిష్కారం కాకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని సామాజిక కార్యకర్త సిలువేరు శ్రీకాంత్ తెలిపారు.

ఆధ్యాత్మికం


గన్నేరువరం: నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు, భక్తులు

పోచమ్మ బోనాలు

గన్నేరువరం: మండలంలోని చాకలివానిపల్లె జీపీ పరిధి కూనవానిపల్లెలో బుధవారం పోచమ్మ, పెద్దమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. గ్రామంలోనిం మహిళలు నెత్తిన బోనాలతో వీధుల గుండా డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


తిమ్మాపూర్: పనులు ప్రారంభిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధి అలుగునూర్‌లో శ్రీలక్ష్మీగణపతి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. తెల్లవారుజామున వేద పండితులు పురాణం మహేశ్వరశర్మ, వేణుగోపాల్‌శర్మ సమక్షంలో వివిధ పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు కంది అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి భక్తులు అధిక సంఖ్యలో ముందుకు వస్తున్నారని, కంది సుమన, రామచంద్ర రెడ్డి ఆలయ ధ్వజస్తంభం, దాతలు సింగిరెడ్డి శ్యామల, స్వామిరెడ్డి నవగ్రహాలు, ఎర్రం అనిత, అనంత రెడ్డి దర్వాజ, డాక్టర్ జాలి ప్రణయ్‌కుమార్‌రెడ్డి ఎలుక విగ్రహం, కంది సరిత,అశోక్‌రెడ్డి మకరతోరణం, శిఖరం,జాప సువర్ణ వెంకట మల్లారెడ్డి గర్భగుడి, సామగ్రి, జాప లక్ష్మీవెంకట్‌రెడ్డి వాటర్ ట్యాంక్, సంగీత, మధుసూధన్‌రెడ్డి, గ్రానైట్ గోపు కిషన్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి కుమారులు గోపు అనిల్, గోపు చందు బోరుబావి నిర్మాణానికి ముందుకు వచ్చారని వివరించారు. దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కంది లక్ష్మీనారాయణరెడ్డి, కాల్వ మల్లేశం, గోపు వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్, పర్శరాములు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ


శంకరపట్నం: కన్నాపూర్‌లో భూమిపూజ

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో పురాతన శివసహిత భక్తాంజనేయస్వామి ఆలయం పునఃనిర్మాణానికి బుధవారం వేదపండితులు, గ్రామస్తులు భూమిపూజ చేశారు. మండలంలోని కన్నాపూర్, ధర్మారం గ్రామస్తులు పాల్గొన్నారు.

'పదవిని అడ్డుపెట్టుకొని అరాచకాలు'

హుజూరాబాద్: ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని వ్యాపారస్తులు, ఇతరులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కమలాపూర్ మండలం వంగపల్లి–గుండేడ్ గ్రామ సరిహద్దులోని ఓ గ్రానైట్ వ్యాపారిదగ్గర హుజూరాబాద్ ఎమ్మెల్యే డబ్బులు వసూలు చేశాడని సాక్షాత్తు వ్యాపారి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిందని, కౌశిక్ రెడ్డి చర్యలతో హుజూరాబాద్ పరువు దిగజారుతోందన్నారు. ఇలాంటి ఎమ్మెల్యేను ఎందుకు గెలిపించుకున్నామని ప్రజలు ఆలోచనలో పడ్డారని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే కౌశిక్‌రెడ్డికి డిపాజిట్ కూడా రాదన్నారు. కౌశిక్ రెడ్డి బాధితులు ముందుకు రావాలన్నారు. ఎమ్మెల్సీగా హుజూరాబాద్‌కు ఎన్ని నిధులు తీసుకొచ్చారని అడిగితే సమాధానం లేదని, ఉపఎన్నికల సమయంలో ఎలాంటి పనులు చేశారో అందరికీ తెలిసిందే అని, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా విఫలమయ్యాడన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఉగ్రవాదాన్ని అణిచివేయాలని, పార్టీలకతీతంగా ఒక్కటిగా పోరాడి ఉగ్రమూకల నివారణకు కృషి చేయాలని, కేంద్రం కఠినంగా వ్యవహరించాలని మరిన్ని సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.

క్రైం వార్తలు

పొలంలోకి దూసుకెళ్లిన కారు

గన్నేరువరం: మండలంలోని పీచుపల్లి గ్రామంలో అదుపుతప్పిన కారు వరి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పింది. మండలానికి చెందిన ఓ వ్యక్తి కరీంనగర్‌లో చదువుకుంటున్న పిల్లలను తీసుకురావడానికి కారులో వెళ్తుండగా పీచుపల్లి శివారులో కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. పంటకు నష్టం వాటిల్లడంతో రైతు పరిహారం చెల్లించాలని కోరాడు. వరికోత మిషిన్‌తో పంట కోసి కారును బయటకు తీశారు.

విద్యుత్‌వైర్లు చోరీ

గంగాధర: మండలంలోని రంగరావుపల్లి, తాడిజర్రి గ్రామ శివారుల్లోని వ్యవసాయ, బోరుబావుల నుంచి విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బచ్చు లక్ష్మయ్య, మల్లారెడ్డి, పాశం రవీందర్, కోల తిరుపతి, రామిడి వేణు, శ్రీరాం సాయిరెడ్డికి చెందిన వైర్లను మంగళవారం రాత్రి చోరీ చేశారు. వారం రోజుల క్రితం చోరీ జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారును ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం సమీపంలో బుధవారం కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. గోదావరిఖనికి చెందిన ఓ కుటుంబం కారులో వరంగల్‌లో పెళ్లికి కారులో వెళ్తున్నారు. వరంగల్–1 డిపోకు చెందిన అద్దెబస్సు ప్రయాణికులతో నిజామాబాద్ వెలుతుండగా కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం సమీపంలో బస్సు ఓవర్‌టేక్ చేసే క్రమంలో కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైంది. ఈప్రమాదంలో కారులో ఉన్నవారితోపాటు బస్సులోని ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ప్రమాద స్థలాన్ని బ్లూకోల్ట్స్ పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు.

మొబైల్ అప్పగింత

ఇల్లందకుంట: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సాయంతో స్వాధీనం చేసుకొని బుధవారం బాధితుడికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నడికుడ మండలం నర్సక్కపల్లికి చెందిన భోగం భిక్షపతి ఈ నెల 10న సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే ఇల్లందకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి, రైటర్ కుమారస్వామి సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సిబ్బందిని ఎస్సై రాజ్‌కుమార్ అభినందించారు. ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా సీఈఐఆర్ పోర్టల్‌లో పూర్తి వివరాలు పొందుపరచాలని సూచించారు.